# సత్యాగ్రహి

రెండో ఆట వదిలి చాలాసేపే అయింది. పట్టణవీధు లన్నీ నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా ఉన్నాయి. సాయంత్రనుంచీ ఆకాశమంతా నల్లటి మబ్బులతో నిండిపోయి వాన జల్లులుగా పడుతూనే వుంది. కరెంటు పోయి అంతా చీకటిగా వుంది. విడవకుండా ఒక దానివెంట ఒకటి వస్తున్న మెరుపుల వెలుగుతప్ప మరే వెలుగూ లేదు.

అలాంటి వాతావరణంలో, ఆ రాత్రి కూడా రోజులాగే, ఇంతవరకూ అయిదు హత్యలుచేసిన ప్రమాదకరమైన హంతకుడి కోసం అన్వేషిస్తున్నాడు సి.ఐ.డి. సుందరం. అతను బికారిలా మాసిపోయి చిరిగిపోయిన పైజామా, లాల్చీ వేసుకున్నాడు. అతని భుజానికి ఓ గుడ్డసంచి వేలాడుతోంది. అందులోంచి మాసిపోయిన లుంగీ ఒకటి కనిపిస్తోంది.

గత నాలుగువారాలుగా అతను అనేక ప్రదేశాల్లో, అనేక వేషాల్లో హంతకుణ్ణి వేయికళ్లతో వెతుకుతున్నాడు. కానీ ఇంతవరకు అతని ఆచూకీ దొరకలేదు.

అసలు హంతకుడు ఎవరో, ఈ హత్యలు ఎందుకు చేస్తున్నాడో పోలీసులకు అంతుబట్టటం లేదు.

హంతకుడు వెండి, బంగారాలు కానీ, డబ్బు కానీ తీసుకువెళ్లటం లేదు. అందుచేత అది దోపిడీ కాదు.

అతను నక్సలైటు కాదు - నక్సలైట్లలో వివిధ గ్రూపులకు చెందినవారిని పోలీసులు జాగ్రత్తగా ప్రశ్నించిన తర్వాత అది స్పష్టమైంది.

హతులు అయిదుగురూ వివిధ పార్టీలకు, కులాలకు, మతాలకు చెందినవారు. ఒక వ్యక్తికి వివిధ పార్టీలకు, కులాలకు, మతాలకు చెందినవారిమీద అంత కక్ష వుందనడానికి ఆధారాలేవీ కనుపించటంలేదు. కనుక రాజకీయ కక్షగాని, కులమత కక్షలు గాని కారణంగా కనుపించటం లేదు.

అతను విప్లవకారుడు కాదు. అతని వెనుక ఏ గ్రూపూ లేదు. అతను ఒంటరి.

అయితే ఒక విషయంమాత్రం పోలీసులకు స్పష్టమైంది. హతులు అయిదుగురూ తమ ధనబలంతో, అధికారబలంతో సమాజాన్ని శాసిస్తున్న పెద్దలు. వారందరికీ క్రిమినల్ రికార్డుపుంది.

హంతకుడు బహుశా సైకో అయివుండవచ్చునని పోలీసులు ఊహించారు.

అతను చాలా ఉత్తముడు, నిజాయితీపరుడు, సత్ప్రవర్తనగలవాడు అయివుండవచ్చు. తన చుట్టూరా జరుగుతున్న అకృత్యాల్ని, అన్యాయాల్ని చూసి అతను మనోవికలత పొంది వుండవచ్చు. తన దృష్టిలో, లోకం దృష్టిలో చీడపురుగులు అనుకున్న వాళ్లను అతను ఒక్కొక్కరినే ఏరిపారేస్తున్నాడు. ఈ రకంగా అతను ఏ మార్పు తీసుకు రావాలనుకుంటున్నాడో స్పష్టంగా తెలియదు. హతుల జీవితాలూ, హత్యలు జరిగిన తీరూ పరిశీలించిన తర్వాత పోలీసు నిపుణులు కూర్చిన చిత్రం అది.

ఏది ఏమైనా అతను ప్రమాదకరమైన హంతకుడు. అతన్ని పట్టుకోవడానికి పోలీసు డిపార్టుమెంటు విశ్వప్రయత్నం చేస్తోంది.

సుందరం ఆ రాత్రి ఆ వేషంలో రోడ్లవెంట తిరుగుతూ జల్లు పెద్దదవగానే ఓ ఇరుకుసందు మధ్యలో మూసివేసిన కొట్టు అరుగుమీదకు చేరాడు. గోడకానుకుని కూర్చుని లాల్చీ జేబులోంచి బీడీకట్ట తీసి, బీడీ వెలిగించి, అగ్గిపుల్ల ఆర్పేస్తూ సందు మొగకేసి చూశాడు. మెరుపుల వెలుగులో ఎవరో వస్తున్నట్టు కనిపించింది. అతని కుడిచెయ్యి మెల్లిగా లుంగీ మడతల్లో వున్న రివాల్వరు మీదకు వెళ్లింది.

అతను కదల్లేదు కానీ, అతని కళ్లు తీవ్రంగా అంత వానలోనూ ఒంటరిగా వస్తున్న వ్యక్తిని పరిశీలించసాగాయి. కొంచెం దగ్గరకు రాగానే అతన్ని గుర్తుపట్టాడు సుందరం.

అతను రామస్వామి - గుడిసెల రామస్వామి.

పట్టణంలో ఎక్కడ ఖాళీజాగా కనిపించినా అక్కడ గుడిసెల రామస్వామి జండా దిగబడుతుంది. అక్కడ రాత్రికి రాత్రి గుడిసెలు వెలుస్తాయి. ఆ గుడిసెల జనానికి అతను పనులు చూసిపెడతాడు. పనులు చేసిపెడతాడు. విశ్వాసపాత్రులకు ఇళ్లస్థలాలు ఇప్పిస్తాడు. ఉద్యోగాలు వేయిస్తాడు. అతన్ని నమ్ముకున్న వాళ్లు బాగుపడతారు. అతనికి ఎదురు తిరిగిన వాళ్లని నాశనం చేస్తాడు.

అతని గుడిసెల ప్రపంచంలో నేరం పాపం పెరిగినట్లు పెరిగిపోతుంది. అతని నాయకత్వాన జూదం, వ్యభిచారం, బ్రాకెట్టు, సారా, డ్రగ్స్ - అన్నీ సజావుగా సాగిపోతుంటాయి. అది అతని రాజ్యం. అక్కడ అతని మాట సుగ్రీవాజ్ఞ. అక్కడ మరో 'లా' చెల్లదు.

అతని జనం అతను నిప్పుల్లో దూకమంటే దూకుతారు.

ఈ జనంతో అతను ఏదైనా చెయ్యగలడు.

లారీల్లో తోలుకొచ్చి సన్మానసభలు జరిపించగలడు. రాళ్లు విసిరించి భగ్నం చెయ్యగలడు. అతను అల్లర్లు, ఆందోళనలు చేయించగలడు. శాంతియాత్రలు నడపగలడు. బందులు, సమ్మెలు చేయించగలడు. వాటి నడుం విరగ్గొట్టనూ గలడు.

అతను - కుడి, ఎడమ - అన్ని పార్టీలకు ఏదో ఒక సమయంలో కావాల్సిన వాడే! అతని అంగబలం వారికి కావాలి. వారి రక్షణ అతనికి కావాలి.

దేశాన్నేలే రాజులకు అతను సామంతరాజు.

అతను రామస్వామి - గుడిసెల రామస్వామి. నేటి పాలిటిక్స్‌కి వెన్నెముక.

అతను మీసాలు మెలితిప్పి, కండలు తిరిగిన శరీరంతో 'నేను ప్రొఫెషనల్ రౌడీని' అన్నట్టు వుంటాడు.

అతను పొగరుగా రొమ్ములు విరుచుకు తిరుగుతుంటే అంతా భయపడి దూరంగా తప్పుకుంటారు.

రామస్వామి కూడా హంతకుడి దృష్టిలో పడవచ్చునని పోలీసులకు అనుమానం వచ్చింది. అతనికి పోలీసు కాపలా ఇస్తామన్నారు. అతను నవ్వి తీసిపడేశాడు. నా ఒంటిమీద చెయ్యి వెయ్యగల మొగాడు ఇంకా పుట్టలేదన్నాడు. అతను మామూలుగా తన వ్యాపారాలు చూసుకుంటూ, రాత్రీ పగలూ ఒక్కోసారి తన పరివారంతోనూ, అప్పుడప్పుడు ఒంటరిగానూ తిరుగుతుంటాడు.

అతను ఆ రోజు అర్ధరాత్రి ఒంటరిగా, నిర్భయంగా నడిచివస్తూ సుందరానికి కనిపించాడు. రామస్వామికి వర్షంకాని, మెరుపులుకాని, విసురుగా వీస్తోన్న ఈదురుగాలి గాని ఏవీ పట్టినట్లు లేదు. అలాంటి రాత్రిలో అతను రోజులాగే పట్టణంలో తిరుగుతున్నాడు.

సుందరం రామస్వామిని గుర్తుపట్టి రివాల్వరు మీంచి చెయ్యితీసి మళ్లీ గోడకి జేరగిలబడ్డాడు బీడీ కాలుస్తూ. అలా అరుగుమీద కూర్చునే సందంతా మరొకసారి పరిశీలించాడు.

సందుకి అవతలివైపునుంచి ఓ ముసలివాడు రామస్వామికి ఎదురువస్తున్నాడు. అతను చేతికర్ర సహాయంతో నడుస్తున్నాడు. వాన తలమీద పడకుండా కండువా కప్పుకున్నాడు. చిన్నగుడ్డ ఒకటి నడుంకి చుట్టబెట్టుకున్నాడు. ముసలివాడైనా అతను చాలా వేగంగా నడుస్తున్నాడు.

అతను నడుస్తున్న వాడల్లా రామస్వామిని సమీపించగానే హఠాత్తుగా ఆగిపోయాడు. రామస్వామి అతనికేసి ఏవిటన్నట్లు యాదాలాపంగా చూశాడు. అలా చూస్తుండగానే ఈదురుగాలికి ముసలివాడు కప్పుకున్న కండువా కొంచెం పక్కకు తొలగింది.

పదిగజాల దూరంలో కొట్టు అరుగుమీదవున్న సుందరానికి మెరుపుల వెలుగులో రామస్వామి మొహంకనిపిస్తోంది కాని అతని ఎదురుగా వున్న వ్యక్తి మొహం కనుపించడం లేదు.

యాదాలాపంగా తలెత్తి చూసిన రామస్వామి రాయిలా అచేతనంగా నిలబడి పోయాడు.

ముసలివాడి చేతికర్ర పైకిలేచి ఠప్పున శబ్దంచేస్తూ రామస్వామి తలమీద దిగింది. వెయ్యిగొడ్లను తిన్న రాబందు ఒక్కవేటుతో కూలిపోయింది. రామస్వామి నిశ్శబ్దంగా రోడ్డు మీద ఒరిగిపోయాడు.

అనూహ్యంగా, హఠాత్తుగా, మెరుపులా అదంతా జరగడంతో సుందరం మెదడు క్షణకాలంపాటు మొద్దుబారిపోయింది.

అది ... హత్య .... ఆరో హత్య

తన కళ్లెదురుగా జరిగిన హత్య ..... అతనే ... హంతకుడు ...

క్షణం తర్వాత తెలివి తెచ్చుకుని వెంటనే అరుగుమీంచి దూకి హంతకుడి వెంట పరుగుతీశాడు సుందరం. అదే సమయంలో జల్లు పెద్దదై కుండపోతగా వర్షం కురియసాగింది. నాలుగడుగుల ముందర ఏముందో కనిపించడంలేదు. సందు చివరదాకా హంతకుడిని తరుముకుంటూ పరుగెట్టిన సుందరానికి హంతకుడు ఎటు పారిపోయాడో తెలియలేదు.

అతను మళ్లీ రామస్వామి దగ్గరకు వచ్చాడు. రోడ్డుమీద బోర్లాపడివున్న అతని శరీరం మీంచి మురికి నీళ్లు ప్రవహిస్తూన్నాయి. సుందరం వంగి

రామస్వామి చెయ్యి పట్టుకుచూశాడు. అతని ప్రాణం ఎప్పుడో పోయింది.

రామస్వామి శవం కేసి చూస్తున్న సుందరాన్ని ఓ ఆలోచన వేధించసాగింది.

హంతకుడు రామస్వామికి తెలుసా? అతన్ని గుర్తుపట్టాడా? కనీసం ఆత్మరక్షణకైనా ప్రయత్నించకుండా షాక్‌లో వున్నట్లు అలా అచేతనంగా ఎందుకుండిపోయాడు? ఇంతకు ముందు అదేవిధంగా జరిగిన అయిదు హత్యల్లోనూ హతులందరూ షాక్‌లో ఉన్నట్లు నిలబడి పోయారేగాని ఆత్మరక్షణకు ఎందుకు ప్రయత్నం చెయ్యలేదు? అసలు హంతకుడు ముసలివాడేనా లేక ముసలివేషంలో వున్న యువకుడా?

అర్ధరాత్రి వేళ వానలో ఓ ముసలివాడు అలా ఒంటరిగా తిరుగుతుండడం అసహజంగా, అనుమానాస్పదంగా తనకు అప్పుడే తోచనందుకు సుందరానికి తనపైన తనకే చీకాకు కలిగింది.

అయితే తన అజాగ్రత్తవలన హంతకుడు పారిపోయిన విషయం అతను ఎవరికీ చెప్పలేదు. ఆచూకీ ఇచ్చినందుకు అభినందించకపోగా, తన అజాగ్రత్తవలన హంతకుడు తప్పించుకుపోయినందుకు చర్య తీసుకుంటారని అతనికి తెలుసు. అసలు హంతకుడు తన కంటపడ్డ సంగతికూడా అతను ఎవరికీ చెప్పలేదు.

మర్నాడు రామస్వామి అంత్యక్రియలు వైభవంగా జరిగాయి. గుడిసెల జనం వేలమంది కర్రలు, కత్తులు తీసుకుని, 'రామస్వామిని చంపేసిన వాడిని చంపేస్తాం', అంటూ రోడ్లమీద పడి వీరవిహారం చేశారు. రైళ్లు ఆపుచేశారు. బస్సులు తగులబెట్టారు. కొట్లు లూటీ చేశారు. ఆ రోజు స్కూళ్లూ, కాలేజీలూ మూసివేశారు. పట్టణంలో హత్యకు నిరసనగా బంద్ జరిగింది.

మంత్రులు ప్రత్యేకంగా హెలికాప్టరులో రామస్వామి భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించడానికి వచ్చారు. అతని నిరాడంబరతని, నిర్భయత్వాన్ని, సహృదయతని, సమాజసేవని - ముఖ్యంగా బడుగువర్గాలకోసం అతను చేసిన కృషిని కొనియాడారు. ప్రభుత్వం ఈ అరాచకాన్ని సహించదనీ, హంతకుడిని ఉరికంబం ఎక్కించేవరకు తాము నిద్రపోమని ప్రతిజ్ఞ చేశారు. రామస్వామి జీవితం ప్రజలకు ఆదర్శనీయమని నొక్కి వక్కాణించి, దేశం ఓ రత్నాన్ని కోల్పోయినందుకు దుఃఖపడ్డారు.

సుందరం గాంధీబొమ్మ దగ్గర జరుగుతున్న ఆ సంతాపసభలోని

ఉపన్యాసాలు వినడంలేదు.

అతను జరిగిన హత్యల గురించి, హంతకుడి మనోప్రవృత్తి గురించి ఆలోచిస్తున్నాడు. మొదటి హత్య జరిగినప్పుడు పిల్లలు, ఆడవాళ్లు చీకటిపడితే బయటికి రావడం మానేశారు. మగవాళ్లుకూడా గుంపులు గుంపులుగా తిరగసాగారు. కొంతకాలానికి మెల్లిగా హంతకుడి ధోరణి వాళ్లకు కూడా అర్థమైంది. అతను సామాన్యుల్ని ఏమీ చేయడన్న విషయం వాళ్లకి స్పష్టమైన తర్వాత భయం తగ్గడమే కాకుండా అతనిమీద ఓ రకమైన ఆరాధన పెరిగింది.

హంతకుడు కోరుకుంటున్నది అలాంటి ఆరాధనా?

లేక అతను ఈ హత్యలు చెయ్యడంలో ఓ రకమైన ఆనందం పొందుతున్నాడేమో! అదే నిజమైతే ఈ కలవరం చూడడానికి అతను తప్పక వస్తాడు. ఇక్కడే తిరుగుతుంటాడు. అతన్ని ఎలాగైనా పట్టుకోవాలి.

సుందరం కళ్లు సభలోని వేలమందిని జాగ్రత్తగా పరిశీలిస్తూనే వున్నాయి. అతను ఊహించినట్లు హంతకుడు అక్కడే వుండి అదంతా చూస్తూనే ఉండి ఉండొచ్చు కాని అతని కంటపడలేదు.

రామస్వామి హత్య తర్వాత పోలీసు డిపార్టుమెంటు మళ్లీ తీవ్రవిమర్శకు గురయ్యింది. ఆరు హత్యలు జరిగిన తర్వాత కూడా హంతకుడి ఆచూకీ తెలియకపోతే ఎలా అని పోలీసు డిపార్టుమెంటు మీద అంతా కారాలు, మిరియాలు నూరారు. మంత్రులు మండిపడ్డారు. పై అధికారులు క్రింది అధికారులమీద విరుచుకుపడ్డారు. పత్రికలు ప్రభుత్వ అసమర్థతను తీవ్రంగా విమర్శించి, పరిస్థితులు ఇలా కొనసాగితే దేశంలో అరాచకం ప్రబలిపోతుందనీ ప్రజల మాన ప్రాణాలకు రక్షణ వుండదనీ హెచ్చరించాయి.

ప్రభుత్వం హంతకుడి ఆచూకీ ఇచ్చినవారికి లక్ష రూపాయల బహుమానం ప్రకటించింది. కాని అతను ఎవరో, ఎక్కడ వుంటాడో ఎవరూ చెప్పలేకపోయారు.

హంతకుడు ఎవరో తెలియకపోయినా, ఎవరిని అతను తర్వాత హత్యచేస్తాడో తెలిస్తే అతన్ని ఎరవేసి హంతకుడిని పట్టుకోవచ్చు. హంతకుడు రామస్వామి హత్యతో ఆగిపోయేవాడు కాదు. రామస్వామితర్వాత మరొకరు - ఏడవ వ్యక్తి

ఏడోవ్యక్తి ఎవరు?

ఆ ప్రశ్నకు త్వరలోనే - వీర్రాజు హత్య, చిన్నమ్మ ఆత్మహత్య తర్వాత - సమాధానం వచ్చింది.

ఏడోవ్యక్తి రాయపరాజు.

రామస్వామి హత్య జరిగిన నెల్లాళ్ళకు, జనం ఇంకా ఆ షాక్‌నుంచి కోలుకోకుండానే మరో దారుణమయిన సంఘటన జరిగింది.

చిన్నమ్మకు, వీర్రాజుకు పెళ్లయిన మూడోరోజున సాయంత్రం కాలవొడ్డుకి షికారుకి వెళ్లిన వీర్రాజును ఎవరో గొడ్డలితో నరికి దారుణంగా హత్యచేశారు.

పది రోజుల తర్వాత చిన్నమ్మని, ఆమె మేనత్తకొడుకు చంద్రరావుని పోలీసులు అరెస్టు చేశారు. చిన్నమ్మ, ఆమె ప్రియుడు చంద్రరావు కలిసి వీర్రాజును హత్య చేశారని నేరం ఆరోపించారు. రుజువుగా చిన్నమ్మ చంద్రరావుకి రాసిన ప్రేమలేఖలు చూపించారు.

చిన్నమ్మ నిర్ఘాంతపడిపోయింది.

ఆమె చిన్నప్పట్నుంచీ మేనత్తకొడుకు పెళ్లాంగా పిలవబడుతూ వచ్చింది. కాలేజీ స్టూడెంటు లీడరుగా రాజకీయాల్లో ఓనమాలు దిద్దుతున్న చంద్రరావును తన కలలహీరోగా ఆరాధించింది. తెలిసీ తెలియని వయసులో అతనికి ప్రేమలేఖలు రాసింది.

కాని చంద్రరావు పోకడ గమనించిన చిన్నమ్మ తల్లిదండ్రులకు ఒక్కగానొక్క బిడ్డ అయిన చిన్నమ్మను అతనికివ్వడం ఇష్టం లేకపోయింది. తల్లిదండ్రులు నచ్చజెప్పిన తర్వాత, తన స్నేహితురాళ్లద్వారా చంద్రరావు గురించి మరికొంత తెలిసిన తర్వాత, చిన్నమ్మ మనసు మార్చుకుంది. చంద్రరావుకీ చిన్నమ్మను చేసుకునే ఉద్దేశం లేదు. అతని ఆశలు, లక్ష్యాలు వేరు. చిన్నమ్మ ఆ విషయం అప్పుడే మరిచిపోయినా, అతను మాత్రం ఆమె రాసిన ప్రేమలేఖలు పదిలపరచి అందరికీ గొప్పగా చూపించేవాడు.

అతను కాలేజీ రాజకీయాలనుంచి పార్టీ రాజకీయాల్లోకి దిగి రాయపరాజుకు కుడిభుజంగా, ఛోటానాయకుడిగా పేరు సంపాదించాడు.

మార్గదర్శకంగావుండి నడిపించడానికి ఏ ఆదర్శాలు, సిద్ధాంతాలు లేని కెరీరిష్టులకు పైకి రావడమన్నది ఒక్కటే లక్ష్యమవుతుంది. స్వప్రయోజనమే వారిని కలుపుతుంది. బంధించి వుంచుతుంది, విడదీస్తుంది. కులం, మతం, భాష, ప్రాంతం, సోషలిజం, ప్రజాస్వామ్యం - ఏ నినాదమైనా

వారు పైకి రావటానికి సోపానంగా ఉపయోగించుకుంటారు.

చంద్రరావుకికూడా జీవితంలో పైకి రావాలన్న ప్రగాఢమైన కోరికవుంది. దానికి కులం నిచ్చెనగా కనిపించింది. అది ఆధారంగా చేసుకుని అతను ఒక్కొక్క మెట్టే ఎక్కసాగాడు. అతని కులం వాళ్లందరూ అతను పైకి వస్తున్నందుకు గర్వించారు. క్రమంగా అతను తన కులపు వాళ్లందర్నీ తన నాయకత్వం క్రిందకు తీసుకొచ్చి ఓ పాతిక వేల ఓట్లు తను ఎటు మొగ్గితే అటు మొగ్గేలా తయారుచేశాడు. దానితో అతనికి గుర్తింపూ, హోదా వచ్చాయి.

అప్రెంటీసు చేస్తున్న పులి నిజంపులి అయింది. ఇక ఆ పులి రాయపరాజుకు తోకగా వ్యవహరించదలచుకోలేదు.

తనదైనస్థానం ఒకటి తనకు ఏర్పరచుకోవాలన్న నిర్ణయానికి వచ్చిన వెంటనే చంద్రరావు రాయపరాజును వదిలేసి మరోపార్టీతో చేతులు కలిపాడు.

రాయపరాజు అతన్ని పిలిపించి నయాన భయాన చెప్పి చూశాడు.

చంద్రరావు కులం ఓట్లు అతనికి కావాలి. అవి లేకపోతే అతను నెగ్గలేడు. అతను నెగ్గకపోతే పార్టీలోనూ, రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అతని పలుకుబడి దెబ్బతింటుంది. అతను నెగ్గడానికి ఏమైనా చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాడు. ఆ విషయం చంద్రరావుకి స్పష్టంగా చెప్పాడు. నా ముందు కుప్పిగంతులు వెయ్యకు అని అతడిని హెచ్చరించాడు.

చంద్రరావు నిర్లక్ష్యంగా నవ్వాడు. నావంటి మీద చెయ్యి పడితే నా కులంవాళ్లు నిన్ను బ్రతకనివ్వరన్నాడు. కాని వంటిమీద చెయ్యివెయ్యకుండా రాయపరాజు మెడలు వంచగలడని వీర్రాజు హత్యకేసులో తనను ఇరికించే వరకు అతనికి అర్థం కాలేదు. అతను కులం అండ చూసుకుని విర్రవీగాడేగాని హత్యకేసులో ఇరుక్కున్న తనకు తనవాళ్లు బాహాటంగా అండగా నిలవలేకపోవడం చూసి కంగారుపడిపోయాడు. బెయిలుమీద విడుదలై వచ్చిన తర్వాత రాయపరాజు కాళ్లమీద పడి అతనితో చేతులు కలిపాడు.

మరో రెండు నెలల్లో పోలీసులు కేసు క్లోజు చేసేశారు.

కాని పసితనం ఇంకా పూర్తిగా పోని చిన్నమ్మ -

పెళ్లయిన మూడోరోజునే భర్తను కోల్పోయింది. ప్రాణంలా భావించిన

భర్తను హత్యచేసిన నేరంమీద అరెస్టు అయింది. లోకనిందకు గురయ్యింది. పోలీసుల చేతుల్లో, కోర్టులో లాయర్ల చేతుల్లో అవమానాలకు, అవహేళనలకు గురయ్యింది. ఆమె కేసు జరిగిన ఈ ఆరు నెలలలోనూ నూరేళ్ల దుఃఖాన్ని అనుభవించింది.

అసలు తన భర్తను ఎవరు చంపారో, ఎందుకు చంపారో ఆమెకు చివరివరకు అర్థం కాలేదు. లోకం తెలియని చిన్నమ్మ ఈ లోకం ఎంత దుర్మార్గమైనదో ఊహించలేకపోయింది.

"భగవంతుడా! నాకే పాపం తెలియదు. నేను నిస్సహాయురాలైన నిరపరాధిని. నన్ను ఈ కష్టాలనుంచి, అవమానాలనుంచి కాపాడు తండ్రీ!" అని దేవుడితో దీనాతిదీనంగా మొరపెట్టుకుంది.

పైన దేముడుంటాడనీ, తనను ఈ కష్టాల నుంచి ఆ దేముడు తప్పక గట్టెక్కిస్తాడనీ, ఆ దీనజన బాంధవుడు ఏ పాపం ఎరుగని తనను నిర్లక్ష్యం చెయ్యడనీ ఆమె గాఢంగా విశ్వసించి నిరంతరం పూజగదిలో దేవుడి విగ్రహంముందు భక్తితో చేతులు జోడించి ప్రార్థిస్తుండేది.

తన భర్తను హత్యచేసి తనను ఇన్ని కష్టాల పాలు చేసిన ఆ రాక్షసుల్ని ఆ దేవుడు తప్పక శిక్షిస్తాడని, నిజం నిప్పులాంటిదని, అది ఏనాటికైనా బయటపడక మానదని, తన దుఃఖాన్ని దిగమ్రింగుకుని, గుండెల్లో అగ్ని పర్వతం దాచుకుని న్యాయంకోసం ఎదురు చూస్తోంది చిన్నమ్మ.

కాని రాయపరాజు పదవులకోసం చేసిన యజ్ఞంలో తన భర్త ప్రాణాలూ, తన జీవితం సమిథలయ్యాయనీ. చెవులతోచూసే న్యాయస్థానాలకు నిజం కనిపించదనీ, నిత్యం తన పూజలందుకుంటున్న బండరాయి తనకి న్యాయం చేకూర్చడని అర్థమైన రోజున ఆ అగ్నిపర్వతం బ్రద్దలైంది. పూజగదిలోవున్న ఆమె ఒక్క ఉదుటున పూనకం పూనినట్లు లేచింది.

"ఇంత ఘోరం జరుగుతుంటే ఇంకా అలా నవ్వుతూ నిలబడ్డానికి నీకు సిగ్గెయ్యడంలేదురా! నీకు పూజలెందుకు, పురస్కారాలెందుకు? ఓరి దేవుడా! నువ్వు చచ్చిపోయావురోయ్! నీ మొహానికి హారతికర్పూరం కాదు, అగ్గిపెట్టాలిరా!" అంటూ మందిరంలోని దేవుడి విగ్రహాన్ని నేలకేసి కొట్టి కాళ్లతో తొక్కేసింది. పగతీరని ఆడత్రాచులా ఆమె ఆవేశంతో తలగోడకేసి కొట్టుకుంది. అంతవరకు ఆమె చేతికున్న గాజులుపగిలి ఆమె లేత చేతులలో గుచ్చుకుని రక్తం చిమ్మింది. నుదురుచిట్లి, నుదుట

కుంకుమ రక్తంలో కలిసి క్రిందికి జారి, కన్నీటితో కలిసి ఎర్రగా ప్రవహించింది. జుట్టు విడివడి, ఆవేశంలో ఎర్రబడ్డ కళ్లతో, ఎర్రచీరలో అపరశక్తిలా ఊగిపోయింది చిన్నమ్మ.

"ఏమిటే చిన్నమ్మా! నీకేమైనా పిచ్చెక్కిందా?" అని ఆపుచెయ్యబోయిన వారిని విదిలించికొట్టి, ఈ మాయలోకం మండి మసైపోవాలని శపిస్తూ, గుండెలు పగిలేలా ఏడుస్తూ చీకట్లోకి పరుగెట్టింది చిన్నమ్మ.

రాత్రంతా నూతులు, గోతులు వెతుకుతున్న జనానికి తూరుపు తెలతెలవారుతుండగా లాకులదగ్గర కనిపించింది చిన్నమ్మ.

ప్రవాహం ముందుకు నెట్టినప్పుడు లాకు తలుపులకు కొట్టుకుంటూ, మళ్లీ నీరు వెనక్కునెట్టినపుడు కొద్దిగా వెనక్కు వస్తూ, మృత్యుదేవత చల్లనిఒడిలో ఉయ్యాలలూగుతున్న పసిపాపలావుంది కాలువలో తేలుతున్న చిన్నమ్మ.

తల్లిదండ్రులూ, చుట్టాలూ పక్కాలూ, ఓదార్చడానికి వచ్చినవాళ్లూ అయిన వారూ కానివారూ, కన్నవారూ, విన్నవారూ - అందరూ శోకించారు. రాయపరాజును శపించారు.

అభాగ్యుల, నిస్సహాయుల శాపాలే నిజమైతే ఈలోకంలో పాపం ఓ క్షణం కూడా బ్రతకలేకపోయేది. కాని శాపాలు నిజంకావు.

లోకరక్షకుడు లోకాన్ని రక్షించకపోతే, పాలకులు పీడకులై రోజు రోజుకు అధర్మం ఇలా ప్రబలిపోతుంటే, న్యాయదేవత కళ్లు మూసుకుని ఒళ్లు అమ్ముకుంటుంటే ఎవరు ఉపేక్షవహించినా 'అతను' ఊరుకుంటాడా?

అతను ఇదంతా చూస్తూ ఊరుకోడు.

అందలమెక్కిన ఈ అసత్యం గుండెల్లో బాకులా దిగబడే సత్యం అతను. అణగద్రొక్కుతున్న ఈ దౌర్జన్యం తలపై కదనుత్రొక్కే దౌర్జన్యం అతను. అధర్మనిధనంకోసం అతను పరశురాముడిలా గండ్రగొడ్డలి పట్టివస్తాడు. న్యాయస్థానాలు వదిలివేసిన దోషికి లోకం వేసిన మరణశిక్షను అతను అమలు జరిపితీరుతాడు.

అతను ఇదంతా చూస్తూ ఊరుకోడు!

ప్రజల దృష్టి మెల్లిగా అజ్ఞాతహంతకుడి మీదకు మళ్లింది.

పోలీసుల దృష్టీ అటే మళ్లింది.

పోలీసులు రాయపరాజు ఇల్లు కోటగా మార్చేశారు. రాయపరాజు ఇంటికి వచ్చిపోయే వారందర్నీ సోదా చెయ్యడం మొదలుపెట్టారు. రాయపరాజు ఇంటికి దారితీసే రోడ్డులో అడుగడుగునా సాయుధపోలీసులు కాపలాకాస్తున్నారు. రాయపరాజు రక్షణకి కనీవినీ ఎరుగని విధంగా రక్షకభటులు రంగంలోకి దిగారు.

ఓ నిస్సహాయురాలిని అసత్యపు హత్యకేసులో ఇరికించి హింసించిన పోలీసులే ఓ హంతకుడిని ప్రతిహింసనుంచి కాపాడడానికి ఇంత పట్టుదల చూపిస్తుంటే లోకం విస్తుపోయింది.

ఎర సిద్ధంగా వుంది కాని చేపవస్తుందా?

ఓపిగ్గా వేచివుంటే ఈ వేళ కాకపోతే రేపైనా హంతకుడు వస్తాడని పోలీసులకు నమ్మకం వుంది.

## 3

కాలవవడ్డున లాకులప్రక్కనే గాంధీబొమ్మ వుంది. ఆ బొమ్మకు తిన్నగా ఒక రోడ్డు ఊళ్ళోకి పోతుంది. ఆ రోడ్డు ఓ వందగజాలు సూటిగా పోయి తర్వాత ఎడంవేపుకి తిరిగి భవనాలవెనుక అదృశ్యమైపోయింది. మరొక రోడ్డు కుడివైపు బస్సుస్టాండుకి పోతుంది. ఆ రోడ్డుమీద, గాంధీబొమ్మకు ఓ పాతికగజాల దూరంలో, గుర్రబ్బళ్లపాక ఒకటి వుంది.

వారం రోజులుగా సుందరం ఆ ప్రాంతంలో మాటు వేస్తున్నాడు. బస్సుస్టాండునుంచి గాంధీబొమ్మ సెంటరు వరకు ఆ ప్రాంతమంతా అతని పహరాలో వుంది. అతను రాత్రి రెండు గంటల వరకూ ఆ రోడ్డు మీద తిరుగుతూ, రెండుదాటిన తర్వాత గుర్రబ్బళ్లపాకవైపు నడిచాడు.

గాంధీబొమ్మ సెంటరు నియాన్‌లైట్ల వెలుగులో పట్టపగలులా వున్నా, పాక దగ్గర మాత్రం చీకటి చీకటిగా వుంది.

సుందరం పాకలోకి రాగానే అక్కడి రాట్లకి కట్టేసిన రెండు గుర్రాలలో ఒకటి కదిలి సకిలించింది. అక్కడ బల్లమీద నిద్రపోతున్న బండివాడు కొంచెం కదిలి తలెత్తి సుందరాన్ని చూసి, కళ్లుమూసుకుని మళ్లీ నిద్దట్లోకి జారిపోయాడు. సుందరం మరో బల్లమీద కూర్చుని బీడీ వెలిగించి రోడ్డుకేసి చూడసాగాడు.

రోడ్డుమీద దీపాలు గుడ్డిగా వెలుగుతున్నాయి. అంతా నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా వుంది.

వేసవికాలం గాలి నిలిచిపోయి ఉక్కగా వుంది. కాలవ కట్టేసిన తర్వాత అక్కడక్కడ నిలిచిన నీరు కంపుకొడుతోంది. పాకలోపల గుర్రపు పెంట వాసనతో చికాగ్గా వుంది. దోమలు గీమంటూ అతని చెవుల్లో గోల చేస్తున్నాయి.

అతను అలా చూస్తుండగా గస్తీ తిరుగుతున్న పోలీసు కారు ఒకటి అతనిముందు నుంచి వెళ్లింది.

అతని దృష్టి రాయపరాజు మీదకు మళ్లింది.

ఇంతమంది కనుగప్పి హంతకుడు రాయపరాజును హత్యచేయగలడా? ఒకవేళ హత్యచెయ్యగలిగినా పట్టుబడకుండా తప్పించుకోగలడా?

అతను అలా ఆలోచిస్తూ ఎంతసేపు కూర్చున్నాడో తెలియదు.

హఠాత్తుగా దూరంగా 'పీ..పీ..పి..పీ' అంటూ విరామం లేకుండా పోలీసుకారు సైరను హెచ్చుతూ తగ్గుతూ మ్రోగుతుంటే అతనికి తెలివొచ్చింది. ఉన్నట్టుండి పట్టణమంతా పోలీసు ఈలలతో ప్రతిధ్వనించసాగింది.

సుందరం ఒక్కసారి ఉలిక్కిపడిలేచాడు. ఇన్ని వందలమంది కాపలా వున్నా రాయపరాజు చావునుంచి తప్పించుకోలేకపోయాడని అతనికి అర్థమైంది.

అదే సమయంలో సమీపంలో ఎక్కడో ఓ క్షణంపాటు కుక్కలు మొరిగాయి. పాకలోని రెండు గుర్రాలు అసహనంగా చిందులు తొక్కుతూ సకిలించసాగాయి.

కనురెప్పవెయ్యకుండా చూస్తున్న సుందరానికి రోడ్డు మలుపు తిరిగి ఇద్దరు వ్యక్తులు సెంటరు వైపువస్తున్నట్లు గుడ్డిదీపాల వెలుగులో కనిపించింది. కొంచెం దగ్గరకు వచ్చాకా రెండవవ్యక్తి నడవడం లేదని, మొదటివ్యక్తి అతడిని ఈడ్చుకువస్తున్నాడనీ అతను గమనించాడు. మొదటివ్యక్తి చేతిలో కర్ర కనుపించింది.

అతను .... హంతకుడు ....

సుందరం గుండె వేగంగా కొట్టుకోసాగింది. చేతిసంచీలోని రివాల్వరు అప్రయత్నంగా అతని చేతిలోకి వచ్చింది.

కుడిచేతనున్న చేతికర్ర ఊతకోసం నేలమీద ఆనించి నడుస్తూ, ఎడంచేత్తో రాయపరాజు జుట్టుపట్టుకుని పెద్దపులి తను వేటాడిన జంతువును ఈడ్చుకువచ్చినట్లు అవలీలగా ఈడ్చుకువచ్చి, కాలవ ఒడ్డున విసిరేశాడు హంతకుడు.

చిన్నమ్మ శవాన్ని కాలవలోంచి తీసిన తర్వాత సరిగ్గా ఇదే ప్రదేశంలో పడుకోబెట్టిన విషయం అంత ఉద్రిక్త పరిస్థితిలోనూ సుందరానికి గుర్తు వచ్చింది. రాయపరాజు శవాన్ని అక్కడకు ఈడ్చుకురావడంలో హంతకుడి ఉద్దేశంకూడా అతనికి అర్థమైంది.

కుడి చేతిలోని రివాల్వరు హంతకుడికేసి గురిపెట్టి, హంతకుడి వైపు నాలుగడుగులు వేశాడు సుందరం.

అదే సమయంలో హంతకుడు రాయపరాజు శవాన్ని వదలి తలెత్తాడు. చీకట్లో వున్న సుందరం హంతకుడికి కనిపించలేదు కాని సెంటరులోని నియాన్‌లైట్ల వెలుగులో నిలబడ్డ హంతకుడు సుందరానికి స్పష్టంగా కనిపించాడు. సుందరం నోటమాట రాక నిలబడిపోయాడు.

అతని చేతిలోని రివాల్వరు జారి క్రింద పడిపోయింది.

ఆ క్షణంలోనే హంతకుడిని చూడగానే హతులందరూ అలా షాక్‌లో వున్నట్లు ఎందుకుండిపోయారో అతనికి అర్థమైంది.

బక్కచిక్కిన శరీరం, చేతిలో కర్ర, నడుంకి కొల్లాయిగుడ్డ, గుండుమీద చిన్న పిలక - సత్యాహింసల స్వరూపం.... అతని ఈ రూపం సుందరానికి, ప్రపంచానికి సుపరిచయమైనదే!

అయితే -

బోసినవ్వులు కురిపించే అతని మొహం ఈ రోజు ఆగ్రహంతో జేవురించింది. కరుణ కురిపించే అతని కళ్లు ఈ రోజు నిప్పులు కక్కుతున్నాయి. అహింసాపథంలో నడిపించిన అతని చేతికర్ర ఈ రోజు ఆయుధమైంది.

ఆగ్రహించిన సత్యంయొక్క ఈ రెండవ రూపంతో సుందరానికి గాని, లోకానికిగాని పరిచయం లేదు.

సుందరం అలా విస్మయంగా నిలబడి చూస్తుండగానే అతడిని మరింత చకితపరుస్తూ మరో వింత జరిగింది.

హంతకుడి రూపం కళ్లు మిరుమిట్లు గొలిపే ఓ కాంతిపుంజంగా మారింది. ఆ కాంతి పుంజం కాలవ ఒడ్డునవున్న గాంధీ విగ్రహంవైపు పయనించి, పైకి లేచి విగ్రహాన్ని అలుముకుంది. క్షణకాలం పాటు విగ్రహం ఓ కాంతిశకలంలా మెరిసింది. తర్వాత మెల్లిగా ఆ కాంతి అదృశ్యమై విగ్రహం మాత్రం ఎప్పటిలాగే మిగిలింది.

తను చూస్తున్నది కలో, నిజమో అర్థం కాక సుందరం మెదడు మొద్దుబారిపోయింది.

కలే అయితే తన ఎదురుగా రాయపరాజు శవం ఎందుకుంది? నిజమే అయితే ఇదెలా సాధ్యం?

సుందరానికి మతిభ్రమిస్తున్నట్లు, స్పృహతప్పుతున్నట్లు అనిపించసాగింది.

తనప్రక్కన పోలీసు కారు ఆగడంకాని, అందులోంచి దిగిన ఆఫీసరు తనవేపు రావడంకాని అతను గమనించలేదు.

కారులోంచి దిగిన ఆఫీసరు రాయపరాజు శవంకేసి, నేలమీద పడివున్న రివాల్వరుకేసి, సుందరంకేసి అయోమయంగా చూసి, సుందరం దగ్గరకు వచ్చి, అతని భుజంమీద చెయ్యివేసి కుదుపుతూ 'ఏమైంది సుందరం?' అని అడిగాడు.

పిచ్చివాడిలా రెండు చేతులూ జోడించి విగ్రహంకేసి తిరిగి నిలబడ్డ సుందరానికి అతని ప్రశ్న వినిపించలేదుగాని, అతని గొంతులోంచి మాత్రం పలవరిస్తున్నట్లు వినిపించింది -

"మహాత్మా! ....... నువ్వా!"

*['విపుల' ఆగష్టు 1989 సౌజన్యంతో]*

★ ★ ★ ★